01ATP09F_01ATP09F.qxd 09-01-2026 PM 10:43 Page 1



అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
శనివారం 10 జనవరి 2026 పేజీలు : 04

# గాడి తప్పి గడియ పెట్టి

**- గురువు పైశాచికం..ఫిర్యాదు ప్రశ్నార్థం..! - కాసులతో కామాంధునికే కాపు కాస్తున్నారు**

**తాడిపత్రి, జనవరి 9, ప్రభాతవార్త:** గురు శిష్యుల మధ్య అక్షర బంధమే కాదు దారిచూపే తండ్రిలాంటి ఒక ప్రత్యేక అత్మీయ బంధం పెనవేసుకొని ఉండేది ఒకప్పుడు. ప్రస్తుతం కొందరు గాడి తప్పుతున్న గురువుల చేష్టలతో గురు శిష్యుల సంబంధానికి అర్థమే మారి పోతోంది. కంటికి రెప్పలా కాయాల్సిన ఓ గురువే తన కూతురు లాంటి వయసున్న చిన్నారి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఓ కలంకిత సంఘటన తాడిపత్రి ప్రాంతంలో చోటు చేసుకోవడం గమనార్హం. దీనిపై నియోజకవర్గ వ్యాప్తంగా చర్చోపచర్చలు సాగుతున్నా అటు విద్యాధికారులు గాని, ఇటు పోలీసులు గాని ఎలాంటి చర్యలకు ఉపక్రమించకపోవడంతో 'తిలా పాపం తలాపిడికెడు' అన్నచందంగా పరిస్థితి తయారైంది. తప్పుచేసిన ఉపాధ్యాయున్ని శిక్షించాల్సింది పోయి ఆ తప్పు నుంచి కొందరు సంబంధిత అధికారులు చలికాచుకునే ప్రయత్నం చేయడం మరింత దారుణం. సమాజం చీదరించుకునే ఈ ఘటనకు కొందరు పెద్దలు ఖరీదు కట్టి మాఫీ చేయడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఆ గురువు ఆ 13 ఏళ్ల బాలిక పట్ల ప్రవర్తించిన తీరుకు కుటుంబ సభ్యులు, స్థానికులు దేహశుద్ధి చేయడమే సంఘటన తీవ్రతకు అద్దం పడుతోందనే చర్చ నడుస్తోంది. విద్యావ్యవస్థకు మచ్చ తెచ్చే ఈ సంఘటన వారం రోజులుగా ఉపాధ్యాయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గత ఆదివారం ఆ ఉపాధ్యాయుడు ప్రత్యేక తరగతులు ఉన్నాయని తాడిపత్రి నుంచి తాను విధులు నిర్వహించే గ్రామానికి రావడం, ప్రత్యేక తరగతులతో సంబంధం లేని ఆ బాలిక ఇంటిలోకి వెళ్లి తలుపు గడియపెట్టి అనుమానం రేకెత్తించినట్లు తెలుస్తోంది. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న ఆ బాలిక తండ్రి వచ్చి తలుపు తీసేంత వరకు బాదడం, తీసిన తర్వాత ఆ ఉపాధ్యాయుడు రగ్గుతో ముసుగు కప్పుకొని కంటపడటంతో ఆగ్రహంతో ఊగిపోయి ఆ గురువును చితకబాదినట్లు వాదనలు వినిపిస్తున్నాయి. ఈ విషయం దావానలంలా వ్యాపించడంతో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుని విన్నపం మేరకు ఆ కామాంధ గురువును వారు విడిచిపెట్టినట్లు, ఆ బాలిక తండ్రితో పాటు గ్రామస్థులు చేసిన దేహశుద్ధితో దుస్తులు చినిగిపోయి, శరీరం రక్తమోడ్చి కన్నులొట్టపోయి ఆ ఉపాధ్యాయుడు అక్కడి నుంచి తప్పించుకున్నట్లు కూడా చర్చ నడుస్తోంది. ఆవేశం చల్లారని ఆ బాలిక కుటుంబ సభ్యులు, బంధువులు తాడిపత్రిలోని ఆ ఉపాధ్యాయుని ఇంటివద్దకు కూడా దాడికి వెళ్లిన విషయం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. అప్పటికే పలాయనం చిత్తగించిన ఆ గురువు రాయబారం నడిపే ప్రయత్నం చేశాడని, తాడిపత్రిలోని ఓ మిఠాయి కొట్టు యజమాని, స్థానిక గ్రామపెద్దలు 'రంగ'ప్రవేశం చేసి గాడి తప్పిన గురువును కాచే ప్రయత్నం చేశారనే విమర్శలు వినిపించాయి. శిక్షపడేలా చేయాల్సిన పెద్దలు ఆ హీన సంఘటనకు వెల కట్టి రూ. 8 లక్షలకు రాజీ చేసినట్లు ప్రస్తుతం చర్చసాగుతోంది. ఈ సంఘటనపై విద్యాశాఖాధికారులు ఆ బాలిక కుటుంబ సభ్యులతో ఏమీ జరగలేదని ఓ ఒప్పంద పత్రంపై సంతకాలు చేయించుకోవడంతో సంఘటన జరిగిన విషయం నిజమేనని అందరూ నిర్ధారణకు వచ్చినట్లైంది. సదరు ఉపాధ్యాయుడు ఇకపై ఆ గ్రామానికి రాకుండా బదిలీపై వెళ్లాలని కూడా ఒప్పందం కుదిరినట్లు తెలుస్తోంది. ఈ సంఘటనపై తీవ్రంగా స్పందించిన ఓ పోలీసు అధికారి బాధితులను ఫిర్యాదు ఇవ్వాలని స్వయంగా వెళ్లి అడిగినా ఇవ్వకపోవడం, మరో పోలీసు అధికారి 'ల' కారంలో వసూలు చేసుకొని సమస్యను గాలికి వదిలేయడం గమనార్హం. ప్రస్తుతం ఆ ఉపాధ్యాయుడు వైద్య సెలవుల్లో వెళ్లి, ఆ పాఠశాల నుంచి బదిలీ చేయించుకునే ప్రయత్నంలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై ఎంఈఓను వివరణ కోరగా సంబంధిత పాఠశాల హెచ్ఎమ్ ఇచ్చిన వివరణను నేను ఇంకా చూడలేదనడం, డీవైఈఓను వివరణ కోరగా ఈ సంఘటనపై ఎంఈఓను విచారణకు ఆదేశించాం, ఆ నివేదిక మాకు రావాల్సి ఉంది. దాని కోసం వేచి చూస్తున్నామని తెలపడం, దీనిపై డీఈఓ వివరణ కోరే ప్రయత్నం చేయగా స్పందించకపోవడం విశేషం.

# దోచుకోవడానికి రాయలసీమ ఎత్తిపోతల పథకం నిర్మాణం

**- వైసీపీ నాయకుల కంపెనీలకు పనుల అప్పగించిన అతి పెద్ద చోర్ జగన్ - లిఫ్ట్ ఇరిగేషన్‌పై మాట్లాడకుండా 18 నెలలుగా ఏం చేస్తున్నావ్...? - జగన్ ఎన్ని బెదిరింపులకు దిగినా అమరావతిని నిర్మించి తీరుతాం : మంత్రి సవిత**

**పెనుకొండ జనవరి 9 (ప్రభాతవార్త)** జగన్ ఎన్ని బెదిరింపులకు దిగినా ప్రజా రాజధాని అమరావతిని నిర్మించి తీరుతామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. అన్ని వ్యవస్థలను నాశనం చేసి, వేల కోట్లు దోచుకున్న జగన్ అతి పెద్ద చోర్ అని ఆరోపించారు. దెయ్యాలు వేదాలు వల్లించినట్లు రాయలసీమకు తీవ్ర ద్రోహం చేసి కూటమి ప్రభుత్వంపై విషం కక్కుతున్నారని మండిపడ్డారు. పెనుకొండలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. అమరావతే రాజధాని అని, తన సొంతింటిని తాడేపల్లిలో కట్టుకున్నానని ప్రజలను నమ్మించాడన్నారు. అధికారంలోకి రాగానే, రాజధాని పేరుతో మూడు ముక్కలాట ఆడారన్నారు. అయిదేళ్లు పాటు రాజధాని లేకుండానే పాలించిన ఘనుడు జగన్మోహన్ రెడ్డి అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో ఏక కాలంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను సీఎం చంద్రబాబు అమలు చేస్తుండడంతో, జగన్ ఓర్వలేకపోతున్నాడని మంత్రి సవిత విమర్శించారు. ప్రజాధనాన్ని దోచుకోవడానికి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పేరుతో జగన్ పెద్ద కుట్రకు తెర తీశారని మంత్రి సవిత మండిపడ్డారు. ఎటువంటి అనుమతులూ లేకుండా వైసీపీ నాయకుల సొంత కంపెనీలకు రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు అప్పగించారన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు చేపట్టడడంతో నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ కోర్టు(ఎన్జీటీ)అడ్డుకు ఒదన్నారు. కేవలం డీపీఆర్ కోసమే రూ.900 కోట్లకు పైనా ఖర్చు చేశారని, ఎత్తిపోతల పథకం పేరుతో రూ.2,745 కోట్ల ప్రజాధనాన్ని వృథా చేశారన్నారు. అక్రమార్జన కోసం రాయలసీమకు, రాష్ట్ర ప్రజలకు జగన్మోహన్ రెడ్డి తీవ్ర ద్రోహం చేశారన్నారు. రాయలసీమపై జగన్ కు నిజంగా ప్రేమే ఉంటే, 18 నెలల నుంచి ఏం చేస్తున్నారని, రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఇన్నాళ్లూ ఎందుకు గుర్తుకు రాలేదని ప్రశ్నించారు. తమ రాజకీయ ఉనికి కోసం తెలంగాణా రాజకీయ పార్టీలు సీఎం చంద్రబాబు పేరును వాడుకుంటాయని, జగన్ కూడా తప్పుడు ఆరోపణలతో విషం చిమ్ముతున్నాడని మంత్రి సవిత మండిపడ్డారు. రాయలసీమకు తాగునీరు, సాగునీరు అందించిన ఘనత సీఎం చంద్రబాబుదేనన్నారు. అన్ని చెరువులను నీటితో నింపామన్నారు. రాయలసీమలో అన్ని సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి రూ.6,613 కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా కుప్పానికి, మడకశిరకు నీరందించామని మంత్రి సవిత గుర్తు చేశారు. జగన్ ఎన్ని బెదిరింపులకు పాల్పడినా, ప్రజా రాజధాని అమరావతిని నిర్మించి తీరుతామని మంత్రి సవిత స్పష్టంచేశారు. ఏపీకి రాజధాని అమరావతేనని, ఇక్కడే ఇల్లు కట్టుకున్నాని రాష్ట్ర ప్రజలను జగన్ మభ్యపెట్టారన్నారు. అధికారంలోకి రాగానే మూడు ముక్కలాట ఆడుతూ ఏపీకి రాజధాని లేకుండా చేశారన్నారు. వైజాగ్ ఎయిర్ పోర్టులో ఈగలు తోలుకుంటున్నారని, ఎర్ర బస్సు కూడా రాని భోగాపురంలో ఎయిర్ పోర్టు ఎందుకని ఆనాడు జగన్ ప్రశ్నించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగనే భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేస్తోందన్నారు. ఇప్పుడు భోగాపురం ఎయిర్ పోర్టు ఘనత తనదేనని జగన్ చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. అన్ని అనుమతులున్నా అయిదేళ్లలో భోగాపురంలో ఎయిర్ పోర్టు నిర్మించలేకపోవడం, 73 శాతానికి పైగా పనులు పూర్తయిన పోలవరం ప్రాజెక్టును పూర్తిచేయలేకపోవడం జగన్ అసమర్థత అని మంత్రి సవిత విమర్శించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**- ప్రభుత్వ గోకులాలతో పశువులకు పూర్తి రక్షణ - మినీ గోకులం షెడ్ల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి**

**నల్లమాడ జనవరి 09 ప్రభాతవార్త** రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పేర్కొన్నారు. మండ లంలోని పెమనకుంటపల్లి లో శుక్రవారం రైతు శంకర్‌నాయక్ రూ.2.30 లక్షలతో నిర్మించిన ప్రభుత్వ మినీ గోకులం షెడ్‌ను ప్రారంభించడంతో పాటు కురుమాలకు చెందిన ఓబులేసు కు పల్లెపండుగ.2లో భాగంగా మంజూరైన మినీగోకులంషెడ్ నిర్మా ణానికి మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డితో కలసి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డిలు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డిలు మాట్లాడుతూ మినీ గోకులాల ద్వారా పశువులకు రక్షణ లభిస్తుందన్నారు. రైతుల సంక్షేమంకోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అహర్నిశలు కృషిచేస్తున్నారని తెలిపారు నియోజకవర్గంలో 300 మినీ గోకులాలు రైతులకు మంజూరు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా పశువులకు నీటి దాహార్తి తీర్చడానికి 300 నీటి తొట్టెలు మంజూరయ్యాయనీ తెలిపారు. రైతులకు డ్రిప్ ,స్ప్రింకర్లు ,మందుల పిచికారి చేసే డ్రోన్లు, వ్యవసాయ పరికరాలను రాయితీతో అందిస్తోందని తెలిపారు. ఇది రైతుల సంక్షేమ ప్రభుత్వమని, ముఖ్యమంత్రి చంద్రబాబు రైతుల పక్షపాతి అని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షులు రమణారెడ్డి , ఏపిడి రమేష్ బాబు ,ఎంపీడీఓ ఏఓ శ్రీనివాస్ రెడ్డి, కన్వీనర్ మైలే శంకర, టీడీపీ నాయకులు దొన్నికోట కేశవరెడ్డి, లక్ష్మన్న ,మంజునాథ్ రెడ్డి, రమణ ,బుట్టి నాగభూషణం, రవి ,అరవింద్ ,బాబావలి, రెడ్డిపల్లి నారాయణస్వామి, నల్లమాడ ఉపాధి హామీ అధికారులు, నాయకులు, పాల్గొన్నారు.



మినీ గోకులం షెడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి

# పనితీరును మెరుగుపరచుకోండి

**- పీజీఆర్ఎస్, బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి - జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్**

**శ్రీ సత్యసాయి జిల్లా, జనవరి 09 , ప్రభాతవార్త ప్రతినిధి:** సచివాల సిబ్బంది తమ పనితీరును మెరుగుపరుచుకోవాలని శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ సూచించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి వివిధ ప్రభుత్వ పథకాల అమలు, సేవలలో మెరుగుదల, సానుకూల ప్రజాభిప్రాయాన్ని పెంచడం తదితరు అంశాలలో ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వివిధ అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వివిధ ప్రభుత్వ పథకాల అమలు, పౌర సేవలలో అత్యంత పారదర్శకంగా వేగంగా ప్రజలకు సంతృప్తికర స్థాయిలో అందజేయాలన్నారు. ఇతర జిల్లాల కంటే మన జిల్లా ర్యాంకింగ్ మెరుగుదలకు క్షేత్రస్థాయి పనితీరు అత్యంత కీలకమన్నారు. ఆ దిశగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేసి సానుకూల ప్రజాభిప్రాయాన్ని పెంచేందుకు కృషి చేయాలన్నారు. ఐవీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్, పీజీఆర్ఎస్ ఫిర్యాదులు, సిబ్బంది ప్రవర్తన తదితర అంశాల ఆధారంగా జిల్లాలకు ర్యాంకులు కేటాయిస్తున్నారని తెలిపారు. ప్రతి సోమవారం కలెక్టరేట్ స్థాయిలో 300కి పైగా పీజీఆర్ఎస్ ఫిర్యాదులు రావడం జరుగుతోందన్నారు. ప్రజలు జిల్లా కేంద్రానికి వచ్చే అవసరం లేకుండా మండల, సచివాలయ స్థాయిలోనే సమస్యల పరిష్కారానికి అంకితభావంతో కృషి చేయాలన్నారు. ఇందుకు ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు సచివాలయాల్లో పీజీఆర్ఎస్ నిర్వహించాలన్నారు. ఈ అంశాన్ని స్వయంగా పర్యవేక్షణ చేయాలని ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లను ఆదేశించారు. లేపాక్షి మండలం చోలసముద్రం, పుట్టపర్తి మండలం ఇర్రగారాజుపల్లి సచివాలయాల పనితీరు సరిగా లేదని దృష్టికి వచ్చిందని ఇక్కడ పనితీరును మెరుగుపరుచుకోవాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సచివాలయ సిబ్బంది ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఉదయం, సాయంత్రం బయోమెట్రిక్ హాజరు వేయాలన్నారు. జిల్లాలో సచివాలయ సిబ్బంది ప్రవర్తనపై కూడా ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజాభిప్రాయం తీసుకోవడం జరుగుతోందన్నారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలని, సచివాలయంలో పని వేళల్లో అందుబాటులో ఉండాలన్నారు. అధిక వసూళ్లపై చర్యలుఏదేని సేవల కోసం ప్రభుత్వం నిర్దేశించిన నిర్ణీత ఫీజులనే వసూలు చేయాలన్నారు. కొన్నిచోట్ల అధిక మొత్తాలు వసూలు చేస్తున్న ఘటనలు వెలుగులోకి వచ్చాయని, ఎక్కడైనా డిజిటల్ అసిస్టెంట్లు అధికంగా ఫీజు వసూలు చేసినట్టు దృష్టికి వస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ పూర్తిగా లబ్ధిదారుల ఇంటి వద్దే జరగాలన్నారు. ప్రతిరోజు చెత్త సేకరణ జరగాలన్నారు. గ్రామాల్లో వారానికి రెండుసార్లు ఇంటింటా చెత్త సేకరణ తప్పనిసరిగా జరగాలని ఆదేశించారు. గృహ నిర్మాణంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు లేఅవుట్లను క్రమం తప్పకుండా సందర్శించి త్వరితగతిన లబ్ధిదారులు ఇల్లు పూర్తి చేసుకునేలా కృషి చేయాలన్నారు. ఈ కేవైసీ, యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే (యు ఎఫ్ ఎస్)లో జిల్లా పనితీరు మెరుగుపరచాల్సి ఉందని పేర్కొంటూ, పెండింగ్ ఉన్న పనులను తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. కౌశలం సర్వేను వారం రోజుల్లో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. వచ్చే నెల నుంచి జిల్లా పనితీరు గణనీయంగా మెరుగుపడాలని, అన్ని అంశాలలో జిల్లా అభివృద్ధిలో ముందు వరుసలో ఉండేలా అంకితభావంతో సమన్వయంగా కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిపిఓ సమత, జి ఎస్ డబ్ల్యూ ఎస్ అధికారి సుధాకర్ రెడ్డి, డిఆర్డిఎ పిడి నర్సయ్య, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్

# గణతంత్ర దినోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్**

**పుట్టపర్తి(కలెక్టరేట్), జనవరి 09, ప్రభాతవార్త** ఈ నెల 26న నిర్వహించనున్న 77వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను పండుగ వాతావరణంలో వైభవంగా నిర్వహించాలని శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. భద్రతా ఏర్పాట్లు, పరేడ్ మైదానంలో చేపట్టాల్సిన సన్నాహకాలపై శుక్రవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్‌తో కలిసి జిల్లా స్థాయి అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జాతీయ పతాకావిష్కరణ, వేదిక ఏర్పాట్లు, అలంకరణ పనులను సుందరంగా చేపట్టాలని సూచించారు. పరేడ్ మైదానంలో బారికేడింగ్, వైట్‌వాష్ తదితర పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. వేడుకలకు హాజరయ్యే ప్రజాప్రతినిధులు, స్వాతంత్ర సమరయోధుల కుటుంబ సభ్యులు, ప్రత్యేక అతిథులను గౌరవప్రదంగా ఆహ్వానించాలని తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించాలని పుట్టపర్తి మునిసిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఆహ్వాన పత్రికలు, ప్రోటోకాల్ అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డిఆర్ఓ కు సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల్లో జిల్లాలో సాధించిన ప్రగతిని ప్రతిబింబించేలా శకటాలు, ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటు చేయాలని డిఆర్డీఏ, డ్వామా, వ్యవసాయ అనుబంధ శాఖలు, ఏపీఎంఐపీ, జల వనరుల శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. దేశభక్తిని చాటే విధంగా ఆకట్టుకునే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, వేడుకల సందర్భంగా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీడిసిఎల్ అధికారులను ఆదేశించారు. ఆయా శాఖల్లో విశిష్ట సేవలు అందించిన అధికారులు, సిబ్బంది, ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందించేందుకు ప్రతిపాదిత జాబితాను నిర్ణీత గడువు లోపు సమర్పించాలని తెలిపారు. జాతీయ పతాకావిష్కరణ అనంతరం పోలీసుల మార్చ్‌ఫాస్ట్‌లో ఎన్సీసీ కేడెట్లను భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు పూర్తి చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ మాట్లాడుతూ, జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని పోలీస్ శాఖ తరపున చేపట్టాల్సిన అన్ని భద్రతా, పరేడ్ ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేసి గణతంత్ర దినోత్సవ వేడుకలను విజయవంతం చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్, జిల్లా రెవెన్యూ అధికారి సూర్యనారాయణ రెడ్డి, ఆర్డీవో సువర్ణ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ

# దేవుడా నీ భూమికి నీవే రక్ష !

**- రాప్తాడులో శ్రీ పండమేటి వెంకటరమణ స్వామి ఆలయ భూములలో అక్రమ నిర్మాణాలు !**





**రాప్తాడు, జనవరి 9 ప్రభాతవార్త** రాప్తాడు మండల కేంద్రంలోని శ్రీ పండమేటి వెంకటరమణ స్వామి ఆల యానికి చెందిన ఎండోమెంట్ భూములు అక్రమార్కుల కబ్జాకు గురవ ుతున్నాయి. ఆలయ నిత్య కైంకర్యాల నిర్వహణ కోసం ఉన్న కోట్ల రూపా యల విలువైన భూముల్లో అనుమతులు లేకుండా అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయి. బీసీకాలనీ ప్రధాన రహదారి పక్కన విస్తరించిన 476 1 సర్వే నంబ రులోని 7.24 ఎకరాల ఎండోమెంట్ భూమిలో ఇష్టారాజ్యంగా ఇళ్ల నిర్మా ణాలు జరుగుతున్నాయి. అధికార పార్టీకి చెందిన మండల నాయకుడి అండద ండలతోనే ఈ అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు వెల్లువె త్తుతున్నాయి. ఆలయ కమిటీ సభ్యుల నిర్లక్ష్యం, దేవాదాయ, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయ లోపం ఆక్రమణదారులకు వరంగా మారిం దని స్థానికులు విమర్శిస్తున్నారు. అక్రమాలపై ఫిర్యాదు చేసిన కాలనీ వాసులకు ఎండోమెంట్ అధికారులు చర్యలు తీసుకోవడం పక్కనపెట్టి, 40 సంవత్సరా లుగా కాపురం ఉంటున్న ప్రభుత్వం నిర్మించి ఇచ్చిన వారి ఇళ్లకే నోటీసులు ఇవ్వడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై నోటీసులు జారీ చేసినప్పటికీ, నిర్వాహకులు వాటిని లెక్కచేయకుండా నిర్మా ణాలు కొనసాగించడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. దేవుడి భూములను కాపాడాల్సిన అధికారులు, పాలకులు స్పందించాలని భక్తులు, కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.



అక్రమ కట్టడాలు కడుతున్న దృశ్యాలు

# ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు సహకరించండి

**దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీకి ఎమ్మెల్యే కాలవ విజ్ఞప్తి**

**రాయదుర్గం జనవరి 9 ప్రభాతవార్త** రాయదుర్గం పట్టణంలోనీ శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రహరి, ఇతర పనులను త్వరగా పూర్తి చేయించాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీకి ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. విజయవాడలో శుక్రవారం సాయంత్రం ఆయన ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ హరి జవహర్ లాల్ ను కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలోనే అత్యంత ప్రాచీనమైన ఆలయాలలో ఒకటైన ఈ గుడిని మన రాష్ట్ర ప్రజలే కాక ఇతర రాష్ట్రాల భక్తులు కూడా అత్యంత భక్తిశ్రద్ధలతో పూజిస్తారనీ వివరించారు. ఆలయ ప్రాకార నిర్మాణం కోసం గతంలో తిరుమల తిరుపతి దేవస్థానం రూ.2.65కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ మేరకు 2024 జూన్ లో కాంట్రాక్టరుతో ఒప్పందం కుదిరిందన్నారు. ఇప్పటి వరకు ఫౌండేషన్, రెండు వరుసల ప్రాకారం పనులతో కలిపి సుమారు 40 పూర్తి అయ్యాయని వివరించారు. అయితే "శ్రీ వాణి పథకం" కింద గతంలో చేపట్టిన పనులను సాంకేతిక కారణాలతో ప్రభుత్వం నిలిపివేసిందని తెలిపారు. అయితే ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడక ముందే ఈ ఆలయ పనులు ప్రారంభమైనందున, సదరు ఉత్తర్వులు దీనికి వర్తించబోవన్నారు.

వినియోగ ధృవీకరణ పత్రం, ఎం బుక్, అడ్వాన్స్ స్టాంప్ రసీదు ఇప్పటికే సంబం ధిత అధికారులకు సమర్పిం చబడ్డాయని తెలియజేశారు. ఈ ఆలయానికి ఉన్న చారిత్రక ప్రాధా న్యత, ప్రజల భక్తి విశ్వా సాలను దృష్టిలో ఉంచు కుని ప్రాకారం పనులను యు ద్ధప్రాతిపదికన పూర్తి చేయా ల్సిన అవసరం వెంటనే పనులు కొనసాగించేలా చూడాలని విన్నవించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు

02ATP27_02ATP27.qxd 09-01-2026 PM 10:36 Page 1



## వ్యాధుల నివారణ, తాగునీటి భద్రతే లక్ష్యం
### నూతన ఎంపీపీ ముల్లంగి నాగమణి



మాట్లాడుతున్న ఎంపీపీ ముల్లంగి నాగమణి

**బొమ్మనహాళ్, జనవరి, 9 ప్రభాతవార్త**

సీజనల్ వ్యాధుల నివారణతో పాటు వచ్చే వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీపీ ముల్లంగి నాగమణి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నూతన ఎంపీపీ ముల్లంగినాగమణి బాధ్యతలుచేపట్టారు అనంతరం ఎంపీపీఆధ్యక్షతన మండలసర్వసభ్య సమావేశం నిర్వహించారు వ్యవసాయం విద్య, వైద్య, రెవెన్యూ, విద్యుత్, పశువైద్య తదిరత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రస్తుతం చలి ఎక్కువ ఉన్న నేపథ్యంలో ప్రజల తీసుకువాల్సిన జాగ్రతలపై అవగాహన కల్పించాలని అన్నారు. అలాగే వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందుగానే ప్రణాళిక బద్ధంగా జాగ్రతలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో మార్కెట్ యార్డు చైర్మన్ హనుమంతరెడ్డి, తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ విజయభాస్కర్, సింగల్ విండో చైర్మన్ కొత్తపల్లి మల్లికార్జున, ఎఓ సాయికుమార్, డిప్యూటీ ఎంపీడీఓ రమణ, పశువైద్యాధికారి వెంకటరెడ్డి, ఎం ఈఓలు వీరన్న, మల్లికార్జున, విద్యుత్ ఏఈఈ లక్ష్మిరెడ్డి, హౌసింగ్ ఏఈఈ వాసంతి, ఎంపీటీసీలు తిమ్మప్ప, చిక్కణ, ప్రమీల, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## ముద్దలాపురంలో డ్రై డే ఫ్రైడే

**బ్రహ్మసముద్రం జనవరి 9 ప్రభాతవార్త**


పరిసరాలను శుభ్రం చేస్తున్న దృశ్యం

మండలం పరిధి లోని ముద్దలాపురం గ్రామంలో పాఠశాల పరిసరాల్లో చెత్త దిబ్బలను తొలగించిన ఇంచార్జ్ పిఓపిఆర్డి యోగేష్ ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా ముద్దలాపురం గ్రామంలో పాఠశాల పరిసరాల్లో చెత్త దిబ్బలను తొలగించి ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాల ముందు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు తెలియజేశారు.

## ఆరోగ్యకేంద్రం అభివృద్ధికి కలసి కట్టుగా శ్రమిద్దాం- డాక్టర్

**బ్రహ్మ సముద్రం జనవరి 9 ప్రభాతవార్త**


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్

మండల పరిధి లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు వైద్యాధికారి డాక్టర్ రాజేశ్ కుమార్ ఆధ్వర్యంలో కమిటీ అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ రాజేశ్ కుమార్ ఎంపిపి కంభం చంద్రశేఖర్ రెడ్డి. రెవిన్యూ పరంగా అర్ ఐ నాగిరెడ్డి షమీర్ ఖాన్ డిప్యూటీ యంపిడిఓ (పరాగ్రాఆ,)అధికారి ఆరోగ్య సిబ్బంది పాల్గొని ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి అందరూ కలిసి కృషిచేయాలని ఏకగ్రీవంగా తీర్మానం చేయడం జరిగింది.

## సంక్రాంతి పండుగ ఆనందానికి సంతోషానికి ప్రతీక
### - సన్ రైజర్స్ పాఠశాలలో ఘనంగా ముందస్తు సంక్రాంతి వేడుకలు

**బెళుగుప్ప, జనవరి 9 ప్రభాతవార్త**


ముగ్గులు పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం


మాట్లాడుతున్న ఎస్ఐ శివ

సంక్రాంతి పండుగ ఆనందానికి సంతోషానికి ప్రతీక అని యస్ఐ శివ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన బెళుగుప్ప సన్ రైజర్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో పాఠశాల కరస్పాండెంట్ మారెన్న అధ్యక్షతన ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందస్తు సంక్రాంతి వేడుకల సందర్భంగా పాఠశాలలో పచ్చటి పైర్లు, ఎద్దుల బండ్లు, ధాన్య రాసులు, కోడి పుంజులు, హరిదాసు, ముత్యాల ముగ్గులతో పల్లెటూరి వాతావరణన్ని కళ్ళకు కట్టినట్లుగా చూపారు. సాంప్రదాయబద్ధంగా చిన్నారులకు భోగి పళ్ళు పోసి హారతులు ఇచ్చారు. విద్యార్థుల తల్లులకు ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముందస్తు సంక్రాంతి వేడుకల కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా ఎస్ఐ శివ, ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు ప్రమీల, విమల, రజిత లక్ష్మి, భువనేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమావేశంలో ఎస్ఐ శివ మాట్లాడుతూ.. సంక్రాంతి మకర సంక్రాంతి ( మకర సంక్రాంతి) అనేది సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించే రోజున జరుపుకునే ఒక ముఖ్యమైన పంటల పండుగ. ఇది ఉత్తరాయణం ప్రారంభాన్ని సూచిస్తుంది. రైతులు పంటల కోసం ప్రకృతికి కృతజ్ఞతలు తెలుపుతారన్నారు. అనంతరం విద్యార్థుల తల్లులకు నిర్వహించిన ముగ్గుల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. అనంతరం చిన్నారులు సంక్రాంతి సంబరాల్లో భాగంగా చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శివ, కరస్పాండెంట్ మారెన్న, డైరెక్టర్లు నాగభూషణ, తిప్పేస్వామి, ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు ప్రమీల, విమల, రజిత లక్ష్మి, భువనేశ్వరితోపాటు వీణా టీచర్, ఉపాధ్యాయ బృందం సంధ్య, శైలజ, భారతి, రషీద, ఎర్రి స్వామి, నాగవేణి, శిరీష, నవీన, మాల శ్రీ, అంజలి విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కందుల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

**బెళుగుప్ప, జనవరి 9 ప్రభాతవార్త**


కందులను తూకం వేస్తున్న దృశ్యం

మండలంలోని వెంకటాద్రి పల్లి గ్రామంలో నాఫెడ్ వారి ఆధ్వర్యంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని మండల తహసీల్దార్ అనిల్ కుమార్, మండల వ్యవసాయ అధికారి పృథ్వి సాగర్, నాఫెడ్ సిబ్బంది, మండల కన్వీనర్ సునీల్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పృథ్వి సాగర్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నాఫెడ్, మార్క్ఫెడ్ వారి సహకారంతో రైతుల నుండి కనీస మద్దతు ధరపై కందులను రూ.8000కు కొనడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీర్పీ గ్రామ సర్పంచ్ భూపతి, మండల నాయకులు సునీల్, మురళి, జయరాములు, ఎర్రిస్వామి, వీఆర్వో ఈశ్వర్ రెడ్డి గ్రామ రైతులు పాల్గొన్నారు.

## నాగరికతలు ఎన్నో అంతరించినా.. హిందూ ధర్మం మాత్రమే శాశ్వతం
### హిందూ ధర్మ సమ్మేళనం లో హారిక మంజునాథ్

**హిందూపురం జనవరి 9 ప్రభాతవార్త**



ప్రసంగిస్తున్న హారిక మంజునాథ్


హాజరైన ప్రజలు

ప్రపంచంలో వేలాది సంవత్సరాలుగా ఎన్నో నాగరికతలు అంతరించి పోయాయి.. గ్రీకు నాగరికత, రోమన్ నాగరికత ఇలా ఎన్నో మట్టిలో కలిసిపోయాయి.. అయితే లక్షలాది సంవత్సరాలుగా హిందూ సనాతన ధర్మం మాత్రమే ఇప్పటికీ శాశ్వతంగా నిలిచిపోయిందని ప్రముఖ ఆధ్యాత్మిక యువ ప్రసంగికురాలు హారిక మంజునాథ్ పేర్కొన్నారు. పట్టణంలోని సూర్యవంశ ఆరెకటిక కళ్యాణమండపంలో శుక్రవారం సాయంత్రం హిందూ సమ్మేళనం ఏర్పాటు చేశారు. విశ్వహిందూ పరిషత్, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ నిర్వహణలో కేకే రవి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి జనసేన నాయకులు నిమ్మకాయల రాము వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కేవలం 19 ఏళ్ల వయసులోనే బెంగళూరుకు చెందిన హారిక మంజునాథ్ ఇప్పటికే ఆధ్యాత్మిక, పౌరాణిక, భారతదేశ సంస్కృతి సాంప్రదాయ రంగాలను మేళవించి పెద్ద సంఖ్యలో యూట్యూబ్ వీడియోలను రూపొందించి హిందూ ధర్మ రక్షణ కోసం పాపులర్ అయ్యారు. నిర్వాహకుల ఆహ్వానం మేరకు ఆమె హిందూపురానికి వచ్చారు. ఈసందర్భంగా హారిక మంజునాథ్ మాట్లాడుతూ 1300 ఏళ్లకు పైగా ఎందరో మతోన్మాదుల, సామ్రాజ్యవాదుల దాడులను ఎదుర్కొని కూడా నేటికీ నిలిచి ఉన్న ఘనత హిందూ ధర్మానిదే అన్నారు. ప్రపంచంలో 100కోట్ల హిందూజనాభా కలిగిఉందని చెప్పారు. ఆర్ఎస్ ఎస్ ధర్మపరిరక్షణకు చేస్తున్నకృషి ఎనలేనిదని గడప వరకే కులం బయటకి వస్తే హిందువులం అన్నారు. కలియుగంలో ఐకమత్యంతోనే హిందూ ధర్మ రక్షణ అని భగవాన్ శ్రీకృష్ణుడుచెప్పాడని, కలియుగాంతంమాత్రమే కల్కి అవతరిస్తాడని అన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా ఫణి భూషణ శర్మ, టిడిపినాయకులు మంగేష్, బిజెపినాయకులు రమేష్‌రెడ్డి,సురువు రామాంజనేయులు, డాక్టర్‌వెంకటరమణ మొదలగు వారు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## వివిధ విభాగాల్లో గుత్తి విద్యార్థుల ప్రతిభ

**గుత్తి, జనవరి 9 ప్రభాతవార్త**


నందకిషోర్ (ఫైల్‌ఫోటో)


లక్ష్మీప్రణతిని అభినందిస్తున్న దృశ్యం

అంతర్జాతీయ, జాతీయస్థాయిలో వివిధ విభాగాల్లో గుత్తి విద్యార్థులు తమ ప్రతిభ చాటారు. గుత్తికి చెందిన విద్యార్థి రాజా నందకిషోర్ ఇటీవల జరిగిన 58వ అఖిలభారత ఇంటర్ ఐఐటి ఫుట్‌బాల్ క్రీడా పోటీలలో ఎంపికై ఉత్తమ ప్రతిభ కనబరిచి రాణించాడు. శుక్రవారం అతనిని ప్రధానోపాధ్యాయుడు నాగరాజు, రఘురాం, యోగా టీచర్ కృష్ణయ్య, కోచ్ రాజులు ఘనంగా సత్కరించారు. అదేవిధంగా యోగ విభాగంలో అంతర్జాతీయ చిల్డ్రన్స్ యోగాసనా క్యాలెండర్‌లో కెప్టెన్ స్కూల్ విద్యార్థిని లక్ష్మీప్రణతి ప్రతిభ కనబరిచి అందులో స్థానం దక్కించుకుంది. ఈ మేరకు సంస్థ సర్టిఫికెట్ పంపడంతో ఆమెను ప్రిన్సిపాల్ నాగరాజు, యోగా మాస్టర్ రామకృష్ణారావు, తదితరులు అభినందించారు. వీరి ప్రతిభ పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## లిటిల్ రోజెస్ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు

**కళ్యాణదుర్గం టౌన్, జనవరి 9, ప్రభాతవార్త**


ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం పట్టణంలోని లిటిల్ రోజెస్ ప్రైవేట్ పాఠశాల నందు శుక్రవారం కరస్పాండెంట్ అలేఖ్య ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఫౌండర్స్ రమేష్ బాబు, శశికళ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు సాంప్రదాయాలకు ప్రతిరూపంగా సంక్రాంతి పండుగను జరుపుకుంటారని తెలిపారు. పాఠశాలకు పండుగ సెలవులు రావడంతో పాఠశాలలో ముందస్తుగా సంక్రాంతి వేడుకలు నిర్వహించామన్నారు. కొత్త సంవత్సరంలో సంక్రాంతి పండుగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు దిపేష్, స్వాతి భాను, కృష్ణ వేణి, వేదవతి, గీత, జ్యోతి, సుధారాణి, గోవిందప్ప, నాగార్జున, ప్రియాంక, షర్మిల, లలిత, హేమలత, జేరిన, మమత, శోభ, శ్రీనివాసులు, రాధ, అనిత విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## కబడ్డీ టోర్నమెంటుకు విరాళం వితరణ

**డి.హిరేహాళ్ జనవరి 9 తర్వాతవార్త**


కబడ్డీ టోర్నమెంట్ బృందంకు విరాళం అందజేస్తున్న వాల్మీకి సంఘం అధ్యక్షులు

రాయదుర్గం నియోజకవర్గం వాల్మీకి సంక్షేమ సేవా సమితి అధ్యక్షులు నాయకుల బండి కిష్టప్ప కబడ్డీ టోర్నమెంట్ బృందం సభ్యులకు విరాళం అందించారు. శుక్రవారం రాయదుర్గం పట్టణంలోని లక్ష్మీ బజార్ లో ఉన్న హనుమాన్ టెక్స్టైల్స్ భవనంలో ఆ సంక్షేమ సేవా సమితి ఉపాధ్యక్షులు మలకన్న, సభ్యులతో కలిసి వాల్మీకి సంక్షేమ సేవా సమితి తరపున విరాళం ఇచ్చారు. రాయదుర్గం ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ కబడ్డీ బృందం సభ్యులు వాల్మీకి సంక్షేమ సేవా సమితి అధ్యక్షులను కలుసుకొని కబడ్డీ ఓపెన్ టోర్నమెంట్ నిర్వహణ విషయమై వివరించగా అందుకు సమ్మతించిన ఆయన రూ. 10100లు విరాళం వితరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కబడ్డీ క్రీడలో రాణించి విజయం సాధించి రాయదుర్గంకు మంచి పేరు గడించాలని కబడ్డీ బృందం సభ్యులకు సూచించారు. క్రీడలతో గుర్తింపు లభిస్తుందని తాలూకా స్థాయి నుండి రాష్ట్రస్థాయి, దేశ స్థాయిలో యువకులు క్రీడల్లో పాల్గొని తమ సత్తాను చాటి జన్మనిచ్చిన జన్మభూమి రుణం తీర్చుకోవాలని ఆయన యువకులకు తెలిపారు. క్రీడలకు వాల్మీకి సంక్షేమ సేవా సమితి ఆధ్వర్యంలో తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఆయన క్రీడా బృందం సభ్యులకు చెప్పారు. తాము అడిగిన తక్షణం టోర్నమెంట్ నిర్వహణకు విరాళమిచ్చి తమను ప్రోత్సహించినందుకు కబడి ఓపెన్ టోర్నమెంట్ బృందం సభ్యులు వాల్మీకి సంక్షేమ సేవా సమితి అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంక్షేమ సేవాసమితి యూత్ సభ్యులు హరీష్ కుమార్, నరేంద్ర, మీడియా సలహాదారులు తలారి మల్లయ్య, బోయపాటి ప్రకాష్, సభ్యులు అజయ్ టైలర్ రఘు, పై తోట శ్రీనివాసులు, రుద్ర, ప్రశాంత్, మిత్రులు న్యాయవాది సూర్యజాన్సన్ పాల్గొన్నారు.

## లేపాక్షి ఆలయం హుండీ ఆదాయం రూ.8.16 లక్షలు

**లేపాక్షి, జనవరి 9 ప్రభాతవార్త**


హుండీ లెక్కిస్తున్న దృశ్యం

లేపాక్షి శ్రీవీరభద్ర స్వామి ఆలయంలో శుక్రవారం హుండీ లెక్కింపు జరిగింది. ఏడు నెలల 20 రోజులకు గాను 8, 16,064 రూపాయల ఆదాయం సమకూరినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కరణంరామానందన్‌తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడు లేనివిధంగా ఆలయానికి భారీ ఆదాయం చేకూరిందన్నారు. ఆలయంలో గత రెండేళ్లుగా పర్యాటకులకు పలు సౌకర్యాలు కల్పించామని పేర్కొన్నారు. అందుకోసమే పర్యాటకులు అధిక సంఖ్యలో ఆలయానికి రావడం జరిగిందన్నారు. దీంతో హుండీ ఆదాయం పెరిగినట్టు తెలిపారు. ఈకార్యక్రమంలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, ఈఓ నరసింహమూర్తి, పురావస్తు శాఖ అధికారి రాము, దేవాదాయ శాఖ సహాయకులు మల్లికార్జున, టిడిపి నేత దుర్గానాని, రామానందన్ మిత్రులు, సభ్యులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు

**హిందూపురం టౌన్ జనవరి 9 ప్రభాతవార్త**


ముగ్గులు వేస్తున్న విద్యార్థులు

పట్టణంలోని వేలంగిని మాత విద్యాలయంలో సంక్రాంతి పండుగ పురస్కరించుకొని ఉత్సాహంగా విద్యార్థులు మధ్య ముగ్గుల పోటీలు నిర్వహించారు. సంప్రదాయ దుస్తులను ధరించి వచ్చినవిద్యార్థులు అందమైనరంగవల్లులను వేస్తూ పోటీపడ్డారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ మేరీస్వరూపారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## హిందూ సమ్మేళనాలు నిర్వహిస్తూ ఉండాలి
### ఆర్ఎస్ఎస్ ప్రముఖులు శివ కిషోర్

**తాడిపత్రి జనవరి 9 (ప్రభాతవార్త)**


సమ్మేళనంలో మాట్లాడుతున్న శివ కిషోర్


సమ్మేళనానికి హాజరైన హిందూ బంధువులు

మండల కేంద్రంలోని రామాలయం దగ్గర శుక్రవారం నిర్వహించిన హిందూ సమ్మేళనానికి భారీగా తరలివచ్చిన హిందూ బంధువులు ముఖ్య అతిథిగా హాజరైన శివ కిషోర్ కి సాదర ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో శివ కిషోర్ మాట్లాడుతూ హిందూ బంధువులు ఒక తాటిపై నిలబడి హిందూ జాతికి పూర్వవైభవం తీసు కొచ్చి దిశగా పయ నించే కార్యక్రమాలు చేపట్టాలని సూచిం చారు. ప్రతి ఒక్క గ్రామంలో దేవాల యాల్లో భజన కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు క్రమం తప్పకుండా చేపట్టాలని హిందూసోదరులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సహకార నిర్వాహకులు శరత్ బాబు, పోస్ట్ ఆఫీస్ లక్ష్మీనారాయణ, నాగరాజు పలు గ్రామాలకు సంబంధించిన భజన బృందాలు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

## సోకాజ్ నోటీసులను వెనక్కి తీసుకోవాలి

**పుట్టపర్తి (కల్చరల్), జనవరి 09, ప్రభాతవార్త**

శ్రీ సత్యసాయి జిల్లాలోని 441 మంది ఉపాధ్యాయులకు అవుట్ టైం ఫేషియల్ అటెండెన్స్ వేయలేదని విద్యాశాఖ అధికారులు జారీ చేసిన సోకాజ్ నోటీసులను వెంటనే వెనక్కి తీసుకోవాలని వైఎస్ఆర్ టి ఏ( యంగ్ సైంటిఫిక్ మైండెడ్ రీసర్చ్ టీచర్స్ అసోసియేషన్ ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంషీద్, జిల్లా అధ్యక్షులు రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి లీలా ఇంద్రప్రసాద్‌లు డిమాండ్‌చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, ఫైవ్ జి ఇంటర్నెట్ ఉన్న ఈ కాలంలో కూడా చాలా చోట్ల నెట్వర్క్ అందుబాటులో ఉండటం లేదన్నారు. ఆప్లైన్లో అటెండెన్స్ ఒక్కొక్కసారి సర్వర్కు సింక్ కావటం లేదనీ, ఇంకా మారుమూల ప్రాంతాల్లో అటవీ సంబంధిత ప్రాంతాల్లో ఈ నెట్వర్క్ సమస్య తీవ్రంగా ఉన్నదన్నారు. కొన్ని పల్లెల్లో నెట్వర్క్ అనేది లేదనీ, ఇలాంటి సందర్భంలో ఉపాధ్యాయులు చాలా సమయం ప్రయత్నించిన తర్వాత కూడా హాజరు వేయలేకపోతున్నారన్నారు. సంక్రాంతి సందర్భంగా శుభవార్త వింటాం అనుకున్న ఉపాధ్యాయులకు ఈ విధంగా ఇబ్బందులకు గురి చేయడము సరైనది కాదన్నారు. ఈ విషయాన్ని వైఎస్ఆర్టిఏ జిల్లా శాఖ పక్షాన ఖండిస్తూ సోకాజ్ నోటీసులు వెనుక తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరుతున్నామన్నారు.

## సంపద సృష్టిస్తామని చెప్పి రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తున్నారు..!
### -సంక్షేమం కుదించి అప్పులు పెంచిన కూటమి ప్రభుత్వ పాలన -పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి -ప్రభుత్వ వైఫలాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు పిలుపు


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

**ఉరవకొండ, జనవరి 9 ప్రభాతవార్త**

సంపద సృష్టిస్తాం..ప్రజలకు పంచుతాం అని గొప్పులు చెప్పి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం సంక్షేమాన్ని కుదించి రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తోందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త వై. విశ్వేశ్వరరెడ్డి ధ్వజమెత్తారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించి వారికి దిశా నిర్దేశం చేసిన ఆయన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు జరిగిన మేలు, నేటి కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రయోజనాలకు దూరంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేస్తున్న అప్పులు రాష్ట్ర భవిష్యత్తునే తాకట్టు పెట్టేలా మారాయన్నారు. ఒకవైపు సంక్షేమాన్ని కుదిస్తూ మరోవైపు లక్షల కోట్ల అప్పులతో ప్రజలపై భారం మోపుతున్న తీరును ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. రైతు భరోసా, అమ్మఒడి, విద్యా దీవెన, ఆరోగ్యశ్రీ వంటి పథకాల ద్వారా వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం కోట్లాది మంది జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలు, అప్పుల నిజాలు, వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన అభివృద్ధి ఈ మూడు అంశాలను ఆయుధాలుగా చేసుకొని ప్రజల్లోకి వెళ్లాలన్నారు. గ్రామస్థాయి నుంచి మండలస్థాయి వరకు పార్టీని బలోపేతం చేయాలని, ప్రతి కార్యకర్త ప్రజల పక్షాన నిలబడి పోరాటానికి సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, మండలాల అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## వడ్డే ఓబన్న జయంతి వేడుకలను విజయవంతం చేయండి

**గుడిబండ జనవరి 9 ప్రభాతవార్త**


తిమ్మలాపురం భీమరాజు

మండల కేంద్రంలో రేపు ఆదివారం నిర్వహించే వడ్డే ఓబన్న జయంతి వేడుకలను విజయవంతం చేయాలని తిమ్మలాపురం భీమరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం ఉదయం మండల కేంద్రంలో వడ్డే ఓబన్న జయంతి వేడుకలను నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమంలో మండల వ్యాప్తంగా ఉన్న వడ్డెర కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## గర్భవతులకు చైర్మన్ అన్నదానం

**లేపాక్షి, జనవరి 9 ప్రభాతవార్త**


గర్భవతులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం గర్భవతులకు లేపాక్షి ఆలయ చైర్మన్ కరణం రామానందన్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని 65 మంది గర్భవతులకు డాక్టర్ వెంకటచిరంజీవి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చిరంజీవి వారికి పలు సూచనలు సలహాలు అందజేశారు. వైద్య పరీక్షల అనంతరం రమామణి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు కరణం రామానందన్ ఆధ్వర్యంలో గర్భవతులకు భోజన సదుపాయం కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, రామానందన్ మిత్రులు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


## విశ్రాంత ఉపాధ్యాయురాలు పాఠశాలకు పుస్తకాలు వితరణ

**లేపాక్షి, జనవరి 9 ప్రభాతవార్త**

లేపాక్షి మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు విశ్రాంత సంస్కృత ఉపాధ్యాయురాలు ఉమాదేవి పుస్తకాలను అందజేశారు. సంస్కృతం, తెలుగు సాహిత్యాలకు సంబంధించిన అనేక పుస్తకాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేషగిరిబాబుకు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ పాఠశాలకు వేలాది రూపాయల విలువచేసే ప్రాచీన పుస్తకాలను అందజేయడం హర్షనీయమన్నారు. పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత సంస్కృత ఉపాధ్యాయురాలు ప్రభావతి, తదితరులు పాల్గొన్నారు.

# హత్య కేసులో ఐదుగురు ముద్దాయిల అరెస్టు
### - ఒక ఇన్నోవా వాహనం రెండు మోటర్ సైకిల్లు స్వాధీనం - డిఎస్పి విజయ్ కుమార్

**పుట్టపర్తి, జనవరి 09, ప్రభాతవార్త**


కేసు వివరాలను వెల్లడిస్తున్న డిఎస్పి విజయ్ కుమార్

కొత్తచెరువు మండలం తిప్పాపట్లపల్లి గ్రామానికి చెందిన మాదినేని మహేష్ హత్య కేసులో ఐదుగురు ముద్దాయిలను అరెస్టు చేసి రిమాండ్ కు తరలిస్తున్నట్లు పుట్టపర్తి డిఎస్పి విజయ్ కుమార్ తెలిపారు. శుక్రవారం డిఎస్పీ కార్యాలయంలో పుట్టపర్తి అర్బన్ సిఐ శివాంజనేయులు తో కలిసి డిఎస్పి మీడియాకు కేసు వివరాలు వెల్లడించారు. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన మాదినేని మహేష్ హత్య కేసులో జిల్లా ఎస్పీ ఆదేశాలతో, డి.ఎస్.పి విజయ్ కుమార్ పర్యవేక్షణలో పుట్టపర్తి టౌన్ పోలీసులు ఐదుగురు ముద్దాయిలను అరెస్టు చేయడం జరిగిందన్నారు. ఈనెల 08 తేదీన గురువారం మధ్యాహ్నము 02.30 గంటల సమయంలో కొత్తచెరువు – పెనుకొండ రోడ్ పైన, తలమర్ల క్రాస్, శ్రీ చైతన్య స్కూల్ వద్ద పుట్టపర్తి అర్బన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ శివాంజనేయులు, తమ సిబ్బందితో ఐదుగురు ముద్దాయిలను పట్టుకొని అరెస్టు చేయడం జరిగిందన్నారు. కేసులో ముద్దాయిలైన యలపల మారుతీ ప్రసాద్ రెడ్డి అలియాస్ తలమర్ల మారుతీ రెడ్డి, సాలక్కగారి వంశీ కిషోర్ అలియాస్ కిషోర్, కోటంపల్లి లోకేష్ అలియాస్ బ్యాంక్ లోకేష్, బాలమిత్ర అలియాస్ బాలు, పుట్లూరు అభిషేక్ అలియాస్ మెకానిక్ అభి లను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుండి ఐదు మొబైల్ ఫోన్లు, వారు నేరంలో ఉపయోగించిన ఒక ఇన్నోవా వాహనం (ఏపీ 02 సి సి 9009), రెండు మోటార్ సైకిళ్లు (పల్సర్ కే ఏ 64 హెచ్ 4149, స్ప్లెండర్ ఏపీ 02 ఏపీ 0105) ఒక క్రైమ్ వెపన్ అయిన ఐరన్ పైప్, మృతుని యొక్క ఎలక్ట్రిక్ స్కూటీ, స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు వివరాలు పరిశీలిస్తే తిప్పా బట్లపల్లి గ్రామానికి చెందిన మృతుడు మాదినేని మహేష్ ముద్దాయి మారుతిరెడ్డి, లోకేష్, అందరూ గతంలో కలిసి వుండేవారని, ఆర్థిక లావాదేవీలు చేస్తుండేవారు. ప్రస్తుతము మారుతిరెడ్డి కి, లోకేష్ కు మరియు మృతుడు మహేష్ కు విభేదాలు వచ్చినాయని, ఈ విషయం లో మృతుడు మహేష్, లోకేష్ ఇద్దరు గొడవ పడి, మహేష్, లోకేషను కొట్టినాడని, కొత్తచెరువు పోలీస్ స్టేషన్ లో మహేష్ పైన కేసు పెట్టాడన్నారు. ఈ విషయం లో 01.01.2026 తేదీ రాత్రి సుమారు 12.30 గంటలకు మృతుడు మహేష్ అతని పై కేసు ఎందుకు పెట్టినారు అని అడుగుదామని ముద్దాయి మారుతి రెడ్డి గెస్ట్ హౌస్ వద్దకు వెళ్ళగా, అప్పటికే గెస్ట్ హౌస్ లో ఈ కేసు గురించి మాట్లాడుకుంటున్న ముద్దాయిలు, మహేష్ తో లేని పోనీ వాగ్వివాదానికి దిగి, కొట్టటానికి వెంబడించగా, మహేష్ తన ఎలక్ట్రిక్ బైక్ మీద పారిపోవడానికి ప్రయత్నించాడన్నారు. ముద్దాయిలు తమ బైకులలో వెంబడించి, హంద్రీనీవా కాలువ వద్ద మృతుడు మహేష్ ను రాయితో, ఐరన్ పైప్ తో మహేష్ కాళ్లమీద, చేతులమీద, తలమీద కిరాతకంగా కొట్టి హత్య చేసి, ఈ విషయము తెలియకుండా వుంచడానికి మృతుడు మహేష్ యొక్క శవమును, తన ఎలక్ట్రిక్ బైకును, ఐరన్ పైప్ ను దుప్పట్లతో కట్టి హంద్రీ నీవ కాలువ లో పడవేశారన్నారు. ఇది వరకే ఎ 1మారుతి ప్రసాద్ రెడ్డి పై 7 క్రిమినల్ కేసులు, పుట్టపర్తి అర్బన్ పోలీస్ స్టేషన్లో రౌడీ షీట్ నంబర్.48 తెరవడిందన్నారు. ఎ2 వంశీ కిషోర్పై 7 క్రిమినల్ కేసులు, కొత్తచెరువు పోలీస్ స్టేషన్ నందు రౌడీ షీట్ నెంబర్.31 నమోదయిందన్నారు. ఎ 3 లోకేష్ పై 2 క్రిమినల్ కేసులు ఉండగా, ఎ 4 బాలమిత్ర, ఎ 5 అభిషేక్ లు సహకారం అందించినట్లు తెలిసింది అన్నారు. ఈ సందర్భంగా ముద్దాయిలను కొత్తచెరువు గ్రామంలో నడిపించుకుంటూ తీసుకెళ్లారు. ఈ కేసులో నేరస్థులను పట్టుకోవడంలో, నేరస్థల పునఃపరిశీలనలో, సాక్ష్యాధారాలను స్వాధీనం చేసుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన పుట్టపర్తి అర్బన్ ఇన్స్పెక్టర్ ఓ.శివాంజనేయులు, ఎస్ ఐలు, వారి సిబ్బందిని డి.ఎస్.పి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో డిఎస్పీతో పాటు సిఐలు శివాంజనేయులు మారుతి శంకర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మినర్వా పాఠశాలలో సంక్రాంతి సంబరాలు


రంగవళ్లులు వేస్తున్న మినర్వా పాఠశాల విద్యార్థులు

అనంతపురం న్యూటౌన్, జనవరి 9 ప్రభాతవార్త

స్థానిక మినర్వా పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు కన్నుల పండువగా జరిగాయి. విద్యార్థులందరూ సంప్రదాయ దుస్తులు ధరించి కనువిందు చేశా రు. పాఠశాల ఆవరణంలో రంగ వళ్లలతో అలంకరించి, భోగి మం టలు వేసి, పొంగల్లు పొంగించి, సంప్రదాయ బద్ధంగా సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. మన తెలుగు వారి పెద్ద పండుగ సంక్రాంతి అని ఇది మన దేశంలోనే అధిక రోజులు జరుపుకునే పెద్ద పండుగ అని తెల్పారు.

## ఆదిమూర్తి నగర్ చైతన్య పాఠశాలలో ఘనంగా సంక్రాంతి సంబరాలు


సంక్రాంతి సంబరాలు జరుపుకుంటున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, జనవరి 9 ప్రభాతవార్త

ఆదిమూర్తి నగర్‌లోని శ్రీ చైతన్య పాఠశాల తొమ్మిదవ బ్రాంచ్‌లో ఘనంగా సంక్రాంతి సంబరాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ఏజి ఎం సుబ్బారెడ్డి విచ్చేశారు. ఆయన సంక్రాంతి పండుగ విశిష్టతను తెలియజేస్తూ ముఖ్యంగా మూడు రోజులు జరుపుకుంటామని తెలియజేశారు. భోగి, సంక్రాంతి, కనుమ. పల్లెల్లో రైతులు కొత్త ధాన్యాలు వచ్చిన కార ణంగా వారి పశువులను అలంకరించి కోడిపందాలను నిర్వహించడం. దానిలో భాగంగా పతంగులను ఎగురవేయడం ఇలా అనేక కార్యక్రమాలను నిర్వహించుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా పిల్లలు రకరకాల హరిదాసు రైతులు మొదలైన అనేక వేషధారణలతో అందరిని అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శాంత, డీన్ గంగాధర్, ప్రైమరీ ఇంచార్జ్ దీప, ప్రీ ప్రైమరీ ఇంచార్జ్ బతులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య పాఠశాలలో సంక్రాంతి సంబరాలు


సంక్రాంతి సంసబరాలు జరుపుకుంటున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, జనవరి 9 ప్రభాతవార్త

కోర్ట్ రోడ్‌లోని శ్రీ చైతన్య పాఠశాలలో సంక్రాంతి వేడుకలను ఏజీఎం సుబ్బారెడ్డి ప్రారంభించారు. పిల్లలందరికీ ముందస్తుగా సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ..సంక్రాంతి అంటే నూతన క్రాంతి ధనస్సు రాశి నుంచి సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశం చడాన్ని మకర సంక్రమణం అంటారు దీని నే మనము సంక్రాంతి పండుగగా జరుపుకుంటాము ఈ పండుగను మనము మూడు రోజులు జరుపుకుంటాము మొదటిరోజు భోగి ఈ రోజున మనము భోగి మంటలు వెలిగించి వాటిలో ఇంట్లో ఉండే పాత వస్తువులను వేసి కొత్త వాటి ద్వారా కొత్త జీవితం ఆరంభించడానికి గుర్తుగా భోగి మంటలు వెలిగి స్తారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తబస్సుం ఏవో గోపాల్ అకాడమిక్ కోఆర్డినేటర్ ఇర్షాద్ డీన్లు చిరంజీవి సిరాజుద్దీన్ ప్రైమరీ ఇంచార్జ్ అశ్విని రాధా, ప్రీ ప్రైమరీ ఇంచార్జ్ శారద అధ్యాపక అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

## ఎస్ఎస్ఎస్ మోక్షిత్ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు


సంక్రాంతి సంసబరాలు జరుపుకుంటున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, జనవరి 9 ప్రభాతవార్త

శ్రీషిర్డి సాయి మోక్షిత్ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. కరస్పాండెంట్ కె.సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. భోగి, మకర సంర్రకాంతి, కనుమ 3 రోజుల విశిష్టతను తెలియజేస్తూ పిల్లలకు కనుమరు గవుతున్న సంప్ర దాయాలను తెలియజేశారు. ఇందులో భాగంగా భోగిమంటలు భోగి పండ్లు పిల్లలకు ఉ పోయడం, విద్యార్థులు ముగ్గులు వేయడం పతంగులు ఎగ రవేయడం, హరిదాసులు, గంగిరెడ్డులు, కర్రసాము, కోలాటం, భరత నా ట్యం, జనపద పాటలు పాడడం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సాయి విజ్ఞాన్ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు


సంక్రాంతి సంబరాలు జరుపుకుంటున్న దృశ్యం

అనంతపురం న్యూటౌన్, జనవరి 9 ప్రభాతవార్త

అనంతపురం మూడవ రోడ్డులో ఉన్న సాయి విజ్ఞాన్ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. ఈ పండుగ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు ఎం.పి శ్రీని వాసులు, సి.కరుణాకర్ బాబు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. లావణ్యరామ్ పండగ యొక్క గొప్పతనాన్ని, సంక్రాంతి విశిష్ట తను, రైతుల పండుగగా మనం ఎందుకు జరుపుకు ంటామో అనేది, పిల్లలకు మన సంస్క ృతి సాంప్రదాయాలను ఎలా గౌరవిం చాలో తెలియజేశారు. చివరిగా పిల్లల తల్లిదండ్రులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని పూజ చేసి ప్రసాదాలు స్వీకరించి హర్షం వ్యక్తం చేస్తూ సాయి విజ్ఞాన్ పాఠశాల యాజమాన్యానికి అభినందనలు తెలిపారు.

## శ్రీ చైతన్య టెక్నోలో అంబారాన్నంటిన సంక్రాంతి సంబరాలు

**- భారతీయ సంస్కృతి సాంప్రదాయాలు భవిష్యత్తు తరానికి ఆదర్శం**

**- పాఠశాల సీఈఓ సంతోష్‌రెడ్డి**


.తెలుగువారి సాంప్రదాయం ఉటి పడేలా దుస్తులను ధరించిన చిన్నారులు


హరిదాసు గంగిరెద్దుల వేశా దారణ, ముగ్గులు బోగిమంటలతో కళకళ లాడుతున్న పాఠశాల ఆరవణం

పామిడి, జనవరి 09 ప్రభాతవార్త

పట్టణంలోని శ్రీ చైతన్య టెక్నో పాఠశాలలో శుక్రవారం జరిగిన సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. గ్రామీణ సంస్కృతిని ప్రతిబింబించే వేశాదారణలతో విద్యార్థినీ విద్యార్థులు చేసిన ప్రసంగాలు, నృత్యప్రదర్శనలు, ఆలపించిన గేయాలు ఆలరించాయి. విద్యార్థినీలు వేసిన రంగు రంగుల ముగ్గులు ప్రత్యేక ఆకర్శనగా నిలువగా హరిదాసు, గంగిరెద్దుల వేశాదారణ, పాలను పొంగించటం, బోగి మంటలు, గొబ్బెమ్మల పాటలు పండుగ విశిష్ట తను చాటిచెప్పుతూ ఒకరికొకరు శుభాకాంక్షలను తెలుకోవటంతో పాఠశాల ప్రాంగ ణం పండుగ వాతావరణం నెలకొంది. పాఠశాల సీఈఓ సంతోష్‌రెడ్డి మాట్లా డుతూ భారతీయ సంస్క్కతి సాంప్రదాయాలు భవిష్యత్తు తరాలకు చేరాల న్నదే సంక్రాంతి సంబరాల ముఖ్యఉద్దేశ్యం అన్నారు. తెలుగువారి సంస్పృతిని ప్రపంచానికి చాటిచెప్పే మొట్టమొదటి పండుగ సంక్రాంతి అని పండుగ విశిష్ట తను వివరించారు. ఈకార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రమణారెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఆర్‌కె హై స్కూల్‌లో ఘనంగా సంక్రాంతి వేడుకలు

అనంతపురం న్యూటౌన్, జనవరి 9 ప్రభాతవార్త : రుద్రం పేటలోని ఎస్ఆర్‌కె స్కూల్‌లో సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణం లో కళకళలాడింది. విద్యార్థులు రంగురంగుల ముగ్గులు వేసి, సంప్రదాయ వస్త్రాధరణలో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా భోగి మంటలు, సంక్రాంతి ప్రత్యేకతను వివరించే ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొనా న్నరు.

# కేసుల ద్వారా విద్యార్థి యువజన ఉద్యమాల్ని అణిచివేయడం ఎవరివల్లా కాదు

**- ఐక్య విద్యార్థి యువజన సంఘాల అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన**

అనంతపురం న్యూటౌన్, జనవరి 9 ప్రభాతవార్త

విద్యార్థులకు యువజనలకు ఎన్నికలలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న విద్యార్థి యువజన సంఘాల నాయకులు పైన కేసులు నమోదు చేసి జైలకు పంపుతూ రౌడీషీట్లు ఓపెన్ చేయడాన్ని ఖండిస్తూ రాష్ట్ర సమితి పిలుపుమేరకు అనంతపురం నగరంలో అంబేద్కర్ విగ్రహం ముందు ధర్నా కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయిస్వామి ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కొత్రేస్ వైఎస్ఆర్సిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు నరేంద్ర జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ వైయస్సార్ యువజన విభాగం రాష్ట్ర నాయకులు మదన్మోహన్ జిల్లా అధ్యక్షులు సాకే చంద్ర ఎన్ఎస్యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేష్ ఏఐఎస్బి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పృథ్వి మాట్లాడుతూ.. ఈ రాష్ట్రంలో ప్రజా పరిపాలన నడుస్తుందా లేదంటే నారా లోకేష్ తీసుకున్న రెడ్బుక్ రాజ్యాంగం నడుస్తుందా అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

ఎన్నికలలో ఇచ్చినటువంటి హామీలు పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు 6400 కోట్లు విడుదల చేయకుండా మన ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే నిరుద్యోగులకు నెలకు 3000 రూపాయల నిరుద్యోగ భృతి కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి ఒకటిన్నర సంవత్సరంపైన కావస్తున్నా నేటికీ ఏ మాత్రం కూడా వాటిని ఆలోచించకుండా నిర్లక్ష్యంగా ఉన్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు హనుమంతు, మంజు, చందు, ఉమా మహేష్, సమీర్ నాని, రాకేష్, శ్రీనివాసులు, ఆనంద్, ఉస్మాన్, సాయి, నవీన్ రెడ్డి, విజయ్‌రెడ్డి, మంజునాథ్ రెడ్డి, కైలాష్ సుధీర్ రెడ్డి, ఫయాజ్, హరీష్, మెహరాజ్, చరన్, నవీన్, లోకేష్, శేఖర్, తేజు, భాను, ఇమ్రాన్, జగన్, సాయి, జా షువా, శివ తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఐక్య విద్యార్థి యువజన సంఘాల నేతలు

## ఘనంగా బచ్చన్ ఏ ప్లే స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి సంబరాలు జరుపుకుంటున్న దృశ్యాలు

అనంతపురం, జనవరి 9 ప్రభాతవార్త బ్యూరో

అనంతపురంలోని బచ్పన్ ఏ ప్లే స్కూల్‌లో శుక్రవారం సంక్రాంతి ముందస్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు సంక్రాంతి పండగ యొక్క ప్రాముఖ్యత గురించి విద్యార్థు లకు వివరించారు. సంప్రదాయ దుస్తులు, హరిదాసు కీర్తనలు, భోగి మంటలు వేసి వేడుకలు జరుపుకున్నారు. చైర్మన్ శాలి దాదా గాంధీ, ప్రిన్సిపాల్ పొన్నపురెడ్డి లక్ష్మి సరిత, ఉపాధ్యాయినిలు పాల్గొన్నారు.

## జెవివి డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న దృశ్యం

అనంతపురం, జనవరి 9 ప్రభాతవార్త బ్యూరో

జన విజ్ఞాన వేదిక డైరీ, క్యాలెండర్‌ను ఎస్కేయూ వైస్ ఛాన్సలర్ ప్రొ.బి.అనిత, రిజిస్ట్రా ర్ డా.ఇ.రమేష్ బాబు చేత ఆవిష్కరించినట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరరాజు తెలియజేశారు. శుక్రవారం వర్సిటీలోని వైస్ ఛాన్సలర్ చాంబర్‌లో జరిగినట్టు ఆయన తెలి పారు. జెవివి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం రాష్ట్ర వ్యాప్తంగా డైరీ, క్యాలె ండర్‌ను తీసుకురావడం జరుగుతుందని అందులో భాగంగానే ఈ సంవ త్సరం కూడా ముద్రించి విద్యాసంస్థలలో పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. ప్రజలలో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలని లక్ష్యంతో జెవివి పనిచేస్తుందని, అది విద్యాసంస్థలు, విద్యార్థుల నుంచే మొదలవ్వాలని అప్పు డే సమాజాన్ని మార్చగలిగే వీలవుతుందని ఈ సందర్భంగా ఆయన తెలియ జేశారు. డైరీ, క్యాలెండర్‌లో సైన్స్ కు సంబంధించిన అనేక అంశాలు పొం దుపరచడం అనేది ఒక మంచి ప్రయత్నమని వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్ లు తెలిపారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి కెంచా లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

## ఎస్‌టియు ఆధ్వర్యంలో పదవతరగతి స్టడీ మెటీరియల్ పంపిణీ


స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేసిన దృశ్యం

అనంతపురం న్యూటౌన్, జనవరి 9 ప్రభాతవార్త

నేతాజీ నగరపాలక ఉన్నత పాఠశాలలో ఎస్‌టియు ఆధ్వర్యంలో పదవ తరగతి స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఇందుకు దాత అనురాధ సహకారంతో శుక్రవారం 65 మంది విద్యార్థినీ, విద్యార్థులకు పాఠశాల హెచ్ఎం ప్రకాష్ రావు, ఎస్‌టియు నాయకుల చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డివిఎస్ ప్రకాష్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, రాష్ట్ర మున్సి పల్ కన్వీ నర్ ఫణి భూషణ్ మాట్లాడుతూ..పదవ తరగతి విద్యార్థులు 100 శాతం మార్కులు సాధించడానికి నిష్ణాతులచే తయారుచేయబడిన ఈ మెటీరియల్ చక్కగా ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మురళీకృష్ణ నాగభూషణం నాయుడు, వన్నూరప్ప, సంజప్ప, మల్లికార్జున, ప్రభాకర్, ఉపాధ్యాయులు ఆదినారాయణ, లక్ష్మి, సాయప్ప, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ట్రంప్ చక్రాధిపత్యానికి వ్యతిరేకంగా ప్రపంచ దేశాలు ఏకమవ్వాలివెనెజులా అధ్యక్షుడి అరెస్టును ఖండిస్తూ అనంతపురంలో సిపిఐ నిరస న



నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఐ నాయకులు

అనంతపురం కలెక్టరేట్ జనవరి 9 ప్రభాతవార్తఅమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రపంచంపై చక్రాధిపత్యం స్థాపించాలనే ధోరణి ఆయన రాజకీయ అవివేకానికి స్పష్టమైన నిదర్శనమని, ఈ తరహా గుత్తాధిపత్యాన్ని ఇకపై సాగనివ్వకుండా ప్రపంచ దేశాలు సమైక్యంగా ఎదుర్కోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగ దీష్ పిలుపునిచ్చారు. వెనెజులా దేశ అధ్యక్షుడు మరియు ఆయన భార్యను అరెస్టు చేసి భయభ్రాంతులకు గురిచేయడాన్ని నిరసిస్తూ మంగళవారం అనంతపురం నగరంలో క్లాక్ టవర్ వద్ద సిపిఐ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహచారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ, ఒక స్వతంత్ర దేశ అంతర్గత వ్యవహారాల్లో అమెరికా జోక్యం చేసుకోవడం అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు పూర్తిగా విరుద్ధమని విమర్శించారు.ఒక దేశ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకునే అమెరికా వైఖరిని అడ్డుకునేందుకు ఐక్యరాజ్య సమితి వేదికగా ప్రపంచ దేశాలు చర్చించి కఠిన నిర్ణయాలు తీసుకోవాలని ఆయన డిమాండు చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పాళ్యం నారాయణస్వామి, చిరంతల మల్లికార్జున మాట్లాడుతూ ట్రంప్ దుర్మార్గమైన చర్యలు చేపట్టినం దుకే న్యూయార్క్ లో ట్రంప్ కు ప్రజలు ఓటు ద్వారా బుద్ధి చెప్పారని ఇప్పటికైనా ట్రంప్ మారక పోతే అమెరికా ప్రజల నుండి వ్యతిరేకతను చవ్విచూడాల్సి వస్తుందన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్.శ్రీరాములు,జిల్లా కార్యవర్గ సభ్యులు సి.లింగమయ్య, బి. రమణయ్య,శ్రీశైలం రాజేష్ గౌడ్,మేకల రమేష్,నగర సహాయ కార్యదర్శి వి.కృష్ణుడు,అలిపిరా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కల్లూరు ఆర్ఎస్ లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం..

గార్లదిన్నె, జనవరి 09, ప్రభాత వార్త: బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో, ఉమ్మడి అనంతపురం ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్ ముంటిమడుగు కేశవ రెడ్డి సహకారంతో కల్లూరు ఆర్ఎస్ లో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ మరియు ఆరోగ్య అవగాహన శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్టేట్ బ్యాంక్ సమీపంలోని ఎం.ఎస్. ఫంక్షన్ హాల్‌లో ఈ శిబిరం జరగనుంది. 30 ఏళ్ల పైబడిన మహిళలు, క్యాన్సర్ లక్షణాలపై అనుమానం ఉన్నవారు తప్పనిసరిగా హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు..

## నరేష్ కుటుంబానికి అండగా ఉంటాం

**- శింగనమల మార్కెట్‌యార్డు చైర్మన్ దండు శ్రీనివాసులు**

శింగనమల, జనవరి 9 ప్రభాతవార్త

మండల పరిధిలోని కల్లుమడి గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త పి.నరేష్ గురువారం విద్యుత్‌షాక్‌తో మృతిచెందాడు. విషయం తెలుసుకుని శుక్రవారం శింగనమల నియోజకవర్గ మార్కెట్‌యార్డు చైర్మన్ దండు శ్రీనివాసులు కల్లుమడి గ్రామానికి వెళ్లి న రేష్ భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నరేష్ తెలుగుదేశం పార్టీ కార్యక్రమల్లో చురుగ్గా పాల్గొనేవారన్నారు. ఆయన కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందన్నారు. ఆయన వెంట టిడిపి నాయకులు దాసరి గంగాధర్, జిల్లా అధికార ప్రతినిధి అనిల్‌కుమార్ యాదవ్, కల్లుమడి ఆయకట్టుచైర్మన్ ఓబుళరాజు, శశిధర్‌నాయుడు, సుధాకర్ నాయుడు, బెస్త నారాయణస్వామి, ఎంపిపటిసి నల్లప్ప, నర్సప్ప, మల్లికార్జున, చలమయ్య, రంగస్వామి, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## సంపత్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఎస్సీ, ఎస్టీ ప్రజా సంఘాల జెఎసి నేతలు


సంపత్‌కుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

శింగనమల, జనవరి 9 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ ఎస్టీ, బిసిఎల్ రాయలసీమ జోనల్ 9 జిల్లాలకు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా నియమించబడిన కొమ్ము సంపత్‌కుమార్‌ను శుక్రవారం జిల్లాకేంద్రంలోని ఆయన నివాసంలో ఎస్సీ, ఎస్టీ ప్రజా సంఘాల జెఎసి చైర్మన్ ముకుందాపురం రవిరాజ్ ఆధ్వర ్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమ ంలో ఎస్సీ, ఎస్టీ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు నేరమెట్ల ఎల్లన్న, ఎమ్మార్పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్న ఆంజినేయులు, పాలచెర్ల ముత్యాలు, బంగి ఓబుళపతి, ఆంధ్రప్రదేశ్ పేరెంట్స్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షులు బండారు చంద్రశేఖర్, ఎమ్మార్పిఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనఅంతపురం జిల్లా పెద్దరాజు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## గర్భ వతులకు వైద్య పరీక్షలు

**- తరిమెల వైద్యాధికారి డాక్టర్ శంకర్‌నాయక్**


గర్భవతులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

శింగనమల, జనవరి 9 ప్రభాతవార్త

మండల పరిధిలోని తరిమెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్ష మాతృఅభియాన్ కార్యాక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా దాదాపు 82 మంది గర్భవతులకు తరిమెల వైద్యాధికారి డాక్టర్ శంకర్‌నాయక్ వైద్య పరీక్షలు నిర్వహించి వారికి సలహాలు, సూచనలు తెలిపారు. అనంతరం వైద్య పరీక్షలకు వచ్చిన గర్భవతులకు కల్లుమడి ఆర్ ఎంపి వైద్యుడు రమేష్ దంపతుల ఆధ్వర్యంలో మంచి పోష కాలు కలిగినటువంటి ఆహారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్ఎన్ గ్రేసి లలిత, సూపర్‌వైజర్ నాగమ్మ, ఫార్మసిస్ట్ నల్లప్ప, ల్యాబ్ టెక్నీషియన్ తిప్పేస్వామి, హెల్త్ ప్రొవైడర్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## నరేష్ కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుంది

**- టిడిపి మండల కన్వీనర్ పెరవలి గోరంట్ల మారుతినాయుడు**


నరేష్ భౌతిక కాయానికి నివాళులు అర్పిస్తున్న గోరంట్ల మారుతినాయుడు

శింగనమల, జనవరి 9 ప్రభాతవార్త

మండల పరిధిలోని కల్లుమడి గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త పి.సురేష్ గురువారం విద్యుత్‌షాక్ తో మృతిచెందాడు. విషయం తెలుసుకుని శుక్రవారం తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ పెరవళి గోరంట్లమారు తినాయుడు వారి గ్రామానికి వెళ్లి నరేష్ భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ..నరేష్ కుటుంబానికి అన్ని విధాలా తెలుగుదేశం పార్టీ అండగా ఉంటు ందని వారి కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ఆయన వెంట సింగిల్ విండో ప్రెసిడెంట్ గుర్రం లక్ష్మినారాయణ, మాజీ మండలకన్వీనర్ చిదంబర దొర, టిడిపి నాయకులు ఓబిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## గార్లదిన్నెలో ఏపీ ఎయిమ్స్ ఫార్మర్ యాప్ నమోదు వేగవంతం చేయాలి..ఏడిఏ అల్తాఫ్ అలీఖాన్..


యూరియా నిల్వలను పరిశీలిస్తున్న సహాయ వ్యవసాయ సంచాలకుల ు అల్తాఫ్ అలీ ఖాన్..

గార్లదిన్నె, జనవరి09,ప్రభాతవార్త:

అనంతపురం జిల్లా సహాయ వ్యవసాయ సంచాల కులు అల్తాఫ్ అలీఖాన్ శుక్రవా రం గార్లదిన్నె మండలంలోని గార్లదిన్నె, జంబులదిన్నె గ్రామా ల్లో పర్యటించి "ఏపీఎయిమ్స్ ఫార్మర్ యాప్ " రైతు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని రైతు సేవా కేంద్రం సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్లే స్టోర్ నుంచి ఏపీ ఎయిమ్స్ యాప్‌ను డౌన్లోడ్ చేసుకుని స్వయంగా నమోదు చేసుకోవాలని సూచించారు. యాప్ ద్వారా వ్యవసాయ నోటిఫికేషన్లు, ముందస్తు చీడపీడల సమాచారం, మార్కెట్ ధరలు వంటి కీలక వివరాలు సులభంగా తెలుసుకోవచ్చని తెలిపారు.అలాగే గత రెండు రోజులుగా మండలానికి 1500 ప్యాకెట్ల యూరియా డీలర్లు మరియు రైతు సేవా కేంద్రాలకు అందినట్లు పేర్కొన్నారు. యూరియా మండలంలోని అన్ని ప్రాంతాల్లో అందుబాటులో ఉందని, రైతులు అధైర్యపడకుండా అవసరమైన మోతాదులో మాత్రమే వినియోగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్, ఏఈఓ సూర్య హరిబాబు, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు..

## అమ్మ హెల్పింగ్ హాండ్స్ ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు అన్నదాన కార్యక్రమం


గర్భిణీ స్త్రీలకు అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

కూడేరు, జనవరి 9 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి నందు అమ్మ హెల్పింగ్ హాండ్స్ అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా ప్రతినెల 9వ తేదీన చెకప్‌ల కోసం వస్తున్న గర్భిణీ స్త్రీలకు భోజనాలు పెట్టాలని నిర్ణయించుకోవడంలో భాగంగానే శుక్రవారం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా సీఐ రాజు, రీసర్వేడీటీ ప్రసాద్, డాక్టర్ ఉషారాణి, వైద్య సిబ్బంది, అమ్మ హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు పాల ్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీఐ, రీసర్వే డీటీ ప్రసాద్ మాట్లాడుతూ.. చాలా మంచి కార్యక్రమం చేపట్టిన మీ సంస్థకు ఏ సహాయ సహకారాలు కావాలన్న మేము తోడుగా ఉంటామని చెప్పడం జరిగింది. ఇందుకు గాను సంస్థ సభ్యులు వారికి ధన్యవాదాలు తెలపడం జరిగింది. అలాగే గర్భిణీ స్త్రీలు సంస్థ సభ్యులకు కడుపునిండా అన్నం పెట్టినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

## అధిక చార్జీలను వసూలు చేస్తే చర్యలు


మాట్లాడుతున్న ఉప రవాణా కమిషనర్ వీర్రాజు

అనంతపురం న్యూటౌన్, జనవరి 9 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం శుక్రవారం అనంతపురం ఉప రవాణా కమిషనర్ కార్యాలయంలో ఉప రవాణా కమిషనర్ వీర్రాజు ఆధ్వర్యంలో జిల్లాలో గల ప్రైవేట్ ట్రావెల్ బస్సుల యజమానులతో సమా వేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంక్రాంతి పండుగ సందర్భంగా వచ్చే అధిక డిమాండ్ నేపథ్యంలో అధిక ధరలు వసూలు చేయరాదని ఆదేశించారు. ఏపీఎస్ఆర్టీసీ నిర్దేశించిన ధరల కంటే 50 శాతం మాత్రమే గరిష్టంగా వసూలు చేసే విధంగా ఆదేశాలు ఇచ్చారు. అధిక ధరలు వసూలు చేసే బస్సు యజమానులపై రవాణా శాఖ దాడులు నిర్వహించి కేసులు పెడతామని తెలియజేశారు. ఈ సమావేశంలో ప్రాంతీయ రవాణా అధికారి సురేష్ నాయుడు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు మరియు బస్సు యజమా నులు పాల్గొన్నారు.

## కొల్లాపూర్ మహాలక్ష్మి ఆలయంలో కుంకుమార్చన కార్యక్రమం


కొల్లాపూర్ మహాలక్ష్మి ఆలయంలో కుంకుమార్చన నిర్వహిస్తున్న దృశ్యాలు

అనంతపురం కల్చరల్, జనవరి 9 ప్రభాతవార్త

స్థానిక హెచ్.ఎల్.సి కాలనీలోని కొల్హాపూర్ మహాలక్ష్మి ఆలయంలో శుక్రవా రం సాయంత్రం భగవతి కరుణామయి విజయేశ్వరి దేవి అమ్మ ఆశీస్సులతో లలితా పరమేశ్వరి దేవి కోటి కుంకుమార్చన కార్యక్రమం ఘనంగా నిర్వహిం చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. లలితా పరమేశ్వరి దేవి కోటి కుంకుమార్చన, భజన, పల్లకి సేవ కార్యక్రమంలో భక్తులందరూ భక్తి శ్రద్ధలతో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## నవభారత్ పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు

అనంతపురం న్యూటౌన్, జనవరి 9 ప్రభాతవార్త

స్థానిక ఆజాద్‌నగర్‌లోని నవభారత్ పాఠశాలలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని రంగోలి ముగ్గులపోటీలు, హరిదాసు సంకీర్తనలు, భోగి మంటలు సంక్రాంతి గొబ్బెమ్మ పాటలు, డాన్సులతో పాఠశాల ఆవరణం సంక్రాంతి పండుగను తలపించింది. కరస్పాండెంట్ నిట్టూరు శశిభూషణ్ మాట్లాడుతూ.. మన సంస్క ృతి, సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం ఈ పండుగ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నిట్టూరు కృష్ణవేణి, నిట్టూరు అనిత, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని వ్యాసరచన పోటీలు

అనంతపురం న్యూటౌన్, జనవరి 9 ప్రభాతవార్త

స్వామి వివేకానందుని జన్మదినాన్ని పురస్కరించుకొని జరిగే జాతీయ యువజన దినోత్సవాన్ని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్, ఎఎన్ఎస్ఈటి, అనంతపురం వారితో కలసి సంయుక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వక్తలు స్వామి వివేకానందుని జీవితాన్ని ఆయన యువతకు అందించిన సందేశ మును కొనియాడారు. భారతీయ ఆధ్యాత్మికత యొక్క గొప్పతనాన్ని ప్రపంచ వ్యాప్తం చేసిన మహానుభావుడని పేర్కొన్నారు. భారత దేశంలో మొట్టమొదటి సారిగా ఆధ్యాత్మికతను సేవతో మిళితం చేసి "మానవ సేవయే మాధవ సేవ" అని బోధించిన మహనీయుడు స్వామీజీ అని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో వ్యాసరచన, వక్తృత్వ, నాటక, రీల్, మైమ్ వంటి పలు పోటీలు నిర్వహించి అందులో విజేతలకు పురస్కారాలు అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సహదేవుడు, ఎన్ఎస్ఎస్ పిఓలు విష్ణుప్రియ, నాగభూషణ, సుగప్ప, బాలాజీ నాయక్, బృంద, నాగార్జున, శ్రీనివాసులు, ఆన్‌సెట్ సూపరిండెంట్ అన్వర్, జై కిసాన్ వ్యవస్థాపకులు శ్రీ నాగమల్లి ఓబులేసు గారు, అకాడమిక్ కోఆర్డినేటర్ విష్ణుప్రకాష్, అధ్యాపకులు శశాంక్ మోళి, శ్రీదేవి ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఇతర విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## కూడేరు మండలంలో కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

కూడేరు, జనవరి 9 ప్రభాతవార్త

అనంతపురం జిల్లా వ్యవసాయ అధికారి రవి శుక్రవారం ఉదయం గొట్కూరు గ్రామంలో పర్యటించి ఆర్ఎస్‌కె సిబ్బంది రబీ సీజన్ ఈ పంట నమోదు ఏవిధంగా చేస్తున్నారో స్వయంగా పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ పంట త్వరితగతిన పూర్తి చేయాలని లాగిన్‌లో ఉన్న ప్రతి సర్వే నంబరు తప్పకుండా పూర్తి చేయాలని సూచించారు. తరువాత గొట్కూరు గ్రామంలో పప్పు శనగ పంటను సందర్శించారు. పంట ఆశించిన స్థాయిలోనే ఉందని పేర్కొన్నారు.తరువాత మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ తో కలిసి కూడేరులో కంది కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కూడేరు మండల రైతులు కంది కొనుగోలు కేంద్రంను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని నిర్వహిస్తున్న శ్రీ చింతల నాయుడుతో మాట్లాడుతూ తేమ శాతము, వ్యర్థాలు వంటి వాటిని ప్రభుత్వం సూచించిన స్థాయి ప్రకారం కొనుగోలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి రవి , మార్క్ ఫెడ్ జిల్లా మేనేజరు పిన్నేశ్వరి, మండల వ్యవసాయాధికారి శుభకర్, తెదేపా మండల కన్వీనర్ మురళి, గ్రామ సర్పంచ్ లలితమ్మ, చింతల నాయుడు, మండల రైతులు, నాయకులు, ఆర్ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

## గార్లదిన్నె పీహెచ్‌సీలో వార్త క్యాలెండర్ ఆవిష్కరణ..


వార్త దినపత్రిక క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం..

గార్లదిన్నె, జనవరి09, ప్రభాత వార్త: గార్లదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లు ఉదయ్ కుమార్, మంజుల ఆధ్వర్యంలో వార్త దినపత్రిక క్యాలెండర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రజలకు నిత్యం ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించడంలో పత్రికల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ప్రజలు ఆరోగ్య విషయాలపై అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వ ఆరోగ్య పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పబ్లిక్ హెల్త్ నర్స్ నర్సమ్మ, సిహెచ్ఓ లోకనాథ్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు..

**CHANGE OF NAME**

I. MUBINA (Old Name) C/o Sattar Sab Hayath Sab, R/o: 1-77, Guttappa Veedi, Amarapuram, Sri Sathya Sai Dist. A.P. PIN:515281. I have Changed my name From MUBINA (Old name) to MUBEENA (New name) Hence forth I belling called As MUBEENA for All purposes

(TH_HEERALA)

**CHANGE OF NAME**

I, TAILAR SHABINA BI (Old name) W/o T Ismail , D.no, 16-4-32, Zulfi Street , Hindupur, Anantapur Dist, A.P , Pin-515201, I have changed my name from TAILAR SHABINA BI (Old Name) TO TAILOR SHABEENA BANU (New name) Hence forth I am being called As TAILOR SHABEENA BANU for all purpose.

